

చోరీకి గురైన ఆవులను పట్టుకున్న రైతు

పాడిరైతే పోలీసు

ఆవుల చోరీ.. కేసు కట్టని పోలీసులు

స్వయంగా దర్యాప్తు చేసి.. ఛేదించిన బాధితుడు

కొత్తచెరువు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జీవనాధారంగా ఉన్న పాడి అవులను ఎవరో ఎత్తుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. కేసు కట్టలేదు. 'ఎవరిమీద అనుమానం ఉందో చెప్పు.. విచారిస్తాం' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో ఆవేదనతో ఇంటికి చేరుకున్న పాడి రైతు, తానే దర్యాప్తు ప్రారంభించాడు. దొంగను గుర్తించి, తన ఆవులను తిరిగి తెచ్చుకున్నాడు. కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామానికి చెందిన ఫణీంద్ర రెడ్డి.. తన కేసును తానే పరిష్కరించుకున్నారు. ఫణీంద్రకు చెందిన రూ.2 లక్షల విలువ చేసే రెండు పాడి ఆవులు, ఒక దూడను ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో తానే దర్యాప్తు ప్రారంభించాడు. ఆ మార్గంలో సీసీ ఫుటేజీని సంపాదించాడు. తన ఆవులను బొలెరోలో తరలించినట్లు గుర్తించి, వాహన యజమానిని వెతికి పట్టుకున్నాడు. గట్టిగా నిలదీయడంతో బాడుగ ఉందని చెప్పడంతో వెళ్లానని, చోరీతో తనకు సంబంధంలేదని చెప్పాడు. ఆవులను అపహరించిన వ్యక్తి పేరు చెప్పేశాడు. ఆ వివరాల ఆధారంగా చోరీ చేసిన వ్యక్తి ఊరికి వెళ్లాడు. గ్రామ పెద్దల సమక్షంలో నిలదీశాడు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఒక వ్యక్తికి రూ.10 వేలు అడ్వాన్స్ తీసుకుని అవులను అమ్మినట్లు దొంగ అంగీకరించాడు. ఫణీంద్ర పుంగనూరుకు వెళ్లి ఆవులను కొనుగోలు చేసిన వ్యక్తిని కలిసి, విషయాన్ని తెలియజేశాడు. తన ఆవులను తిరిగి తెచ్చుకున్నాడు. మూడు రోజుల వ్యవధిలో కేసును సక్సెస్‌ఫుల్‌గా క్లోజ్ చేశాడు.

కరెంటు కష్టాలు తీరుతాయ్..!

బీసీ కాలనీలో విద్యుత్ శాఖ అధికారుల పర్యటన

స్తంభాలు, లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నివేదిక తయారీ

ఇళ్లపై ఉన్న 33 కేవీ లైన్ మార్చేందుకు సైతం..

కొత్తచెరువు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపట్టిన వినూత్న కార్యక్రమం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సత్ఫలితాలను ఇస్తోంది. కొత్తచెరువు బీసీ కాలనీ ప్రజల కోసం జనవరి 28 నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొన్న విషయం తెలిసిందే. కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజలు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారానికి అధికారులు, ఎమ్మెల్యే, మాజీ మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇప్పటికే డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. తాజాగా విద్యుత్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. బీసీ కాలనీ, ఎన్టీఆర్ నగర్, వేణుగోపాల్ నగర్‌లోని ఎల్-1,2,3,4 ప్రాంతాలలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అంచనాలను తయారు చేశారు. కాలనీలలో రెండు రోజులపాటు పర్యటించి, ఎన్ని స్తంభాలు అవసరమో, ఎంత ఖర్చు అవుతుందో గుర్తించారు. విద్యుత్ లైన్, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు ఎన్టీఆర్ కాలనీకి రూ.3.61 లక్షలు, బీసీ కాలనీకి రూ.3.45 లక్షలు, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఎల్-3 కాలనీకి రూ.2.94లక్షలు, పాత బీసీకాలనీకి రూ.2.94 లక్షలు ఖర్చు అవుతుందని ఎస్టిమేషన్ తయారు చేశారు. ఇళ్లపై వెళ్తున్న 33 కేవీ హైటెన్షన్ లైన్ మార్పునకు రూ.8 లక్షలు అవుతుందని అంచనా వేశారు. నివేదికను ఎమ్మెల్యేకి అందజేస్తామని, డీడీలు చెల్లించగానే పని పూర్తి చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్ నాయక్ తెలిపారు. ఎల్ఐలు రవి, కేశవ, టౌన్ కన్వీనర్ ఒలిపి శీనతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు.



బీసీ కాలనీలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఇళ్లపై వెళ్లిన హై టెన్షన్ విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఏఈ

ఆంధ్రజ్యోతి

అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



తనకల్లు సీహెచ్‌సీ



చికిత్స కోసం వచ్చిన రోగులు

మందుల్లేని ఆస్పత్రి

తనకల్లు సీహెచ్‌సీలో మందుల కొరత

సీజనల్ రోగాలతో పెరిగిన బాధితులు

దగ్గు, జలుబుకు కూడా మాత్రలు కరువు

అధికారులు పట్టించుకోవాలంటున్న ప్రజలు

తనకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మందుల సరఫరా లేకపోవడంతో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ జబ్బులతో ఆస్పత్రికి వచ్చిన వారికి సరిపడా మందులు లేవని వైద్యులు చెబుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. మండల కేంద్రమైన తనకల్లులో 30 పడకల ఆసుపత్రి ఉంది. జాతీయ రహదారి, అమడగూరు, నంబులపూలకుంట, నల్లచెరువు, అన్నమయ్యజిల్లా మొలకలచెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి సరిహద్దు మండలాల్లో ఎక్కడ ప్రమాదాలు జరిగినా 108లో క్షతగాత్రులను తొలుత తీసుకువచ్చేది ఈ ఆస్పత్రికే. వివిధ జబ్బులతో బాధపడేవారు రోజూ వందల సంఖ్యలో ఈ ఆస్పత్రికి వస్తుంటారు. వీరికి సరపడా మందులు లేకపోవడం ఇబ్బంది కలిగిస్తోంది.

అందుబాటులో స్పెషలిస్టు డాక్టర్లు

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదుగురు స్పెషలిస్టు డాక్టర్లు, పదిమంది దాకా ఇతర సిబ్బంది అందుబాటులో ఉన్నారు. వీరు మంచి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే రోగులకు ఇవ్వాల్సిన మాత్రలు, ఇంజెక్షన్లు, మందులను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు నిరాశతో వెళుతున్నారు. గత నెలరోజులుగా తనకల్లు సీహెచ్‌సీలో చిన్నపిల్లలకు ఇచ్చేటానిక్‌లు, నొప్పులకు ఇచ్చే ఇంజెక్షన్లు, యాటిబయాటిక్స్, మల్టీ విటమిన్లు, రాన్‌ట్యాక్, డైక్లో లాంటి ఇంజెక్షన్లు, పారాసిట్‌మాల్ లాంటి మాత్రలు కూడా అందుబాటులో లేవు. దీంతో ఇటు రోగులు, అటు ఆసుపత్రిల్లో పనిచేస్తున్న సిబ్బంది నానాతంటాలు పడాల్సి వస్తోంది. గతంలో ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాలురోజులకు సరిపడ మందులు, మాత్రలు ఇచ్చేవారు. ప్రస్తుతం సాధారణ జలుబు, దగ్గుకు కూడా ఒకటి, రెండు మాత్రలు ఇచ్చి పంపుతున్నారు.

ఇతర ఆస్పత్రుల నుంచి మందుల అప్పు

గతనెలలో ఇతర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీల నుంచి తనకల్లు వైద్యసిబ్బంది పలు రకాల మందులను బదులు(అప్పు)గా తీసుకున్నారు. ఈ నెలలో కూడా ఆస్పత్రికి మందులు రాకపోవడంతో రోగులకు ఏమి సమాధానం చెప్పాలోనని వారు మథనపడుతున్నారు. అయితే సంబంధిత ఉన్నతాధికారులు మాత్రం అత్యవసర మందులు ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి సర్దుకోవాలంటే ఆదేశాలు ఇస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు పెరిగిపోయి, ఎక్కడచూసినా జలుబు, దగ్గు, జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు జలుబు, దగ్గు, నొప్పులతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. తనకల్లు సీహెచ్‌సీకి ప్రమాద కేసులు కాకుండా సాధారణ రోగులే ప్రతిరోజు మూడు వందల మంది నుంచి నాలుగు వందల మంది దాకా వస్తున్నట్లు సిబ్బంది చెబు తున్నారు. ఇంతమందిని పరీక్షించి, డాక్టర్లు మందులు రాస్తే... చీటి తీసుకుని ఫార్మసిస్టు వద్దకు వెళ్లే రోగులకు నిరాశే ఎదురవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తనకల్లు సీహెచ్‌సీకు మందులను సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సూదిమందు లేదంట



వొళ్లు నొప్పులతో అల్లాడిపోతున్నా. ఆసుపత్రికి వస్తే డాక్టరమ్మ పరీక్షించి, సూది మందు రాసింది. మందులు ఇచ్చే దగ్గరికి పోతే సూదిమందు లేదంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే నొప్పులకు మందులు లేకపోతే ఇంకెట్లా, వెంటనే ప్రభుత్వం స్పందించి ఆస్పత్రిలోనే మందులు అందించాలి.

- తిరుపాల్, గరుజోనాలపల్లి, నల్లచెరువు మండలం

30 కి.మీ. నుంచి వచ్చా



మాగ్రామం నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించి ఆసుపత్రికి వచ్చా. పరీక్షించిన డాక్టర్లు మందులు చీటీ రాసిచ్చారు. చీటి తీసుకుని మందులిచ్చే గదికి వెళితే నాలుగు బిల్లలు చేతిలో పెట్టారు. మా ఊరి నుంచి రోజూ మాత్రల కోసం రావాలంటే చాలా కష్టం. కనీసం వారానికి సరపడ మందులు ఇవ్వకపోతే ఎలా..?

- ఆదెమ్మ, ఎర్రగుట్టపల్లి, తనకల్లు మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

ఆసుపత్రిలో మందుల కొరత ఉన్న విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గత నెలలో ఇతర ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నుంచి మందులు అప్పుగా తెచ్చుకున్నాం. ఈనెలకు సపరిడే మందులు కొనుగోలు చేయమని ఉన్నతాధికారులు చెప్పారు. అవిషయాన్ని పరిశీలిస్తున్నాం.

- విజయ్‌బాబు, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, తనకల్లు

పేకాటకు చెక్ పెట్టండి

సరిహద్దుల్లో నిరంతరం నిఘా ఉండాలి

నేర సమీక్షలో ఎస్పీ వి.రత్న

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పేకాటకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఆమె మాట్లాడుతూ గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ ఎస్టీ, పోక్సో, మర్డర్, చోరీ కేసుల గురించి ఆరాతీశారు. అరెస్టయిన నిందితులపై త్వరగా చార్జ్‌షీట్ వేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు వాహనాల తనిఖీ ఉండాలని, బోర్డర్ చెక్ పోస్టులలో నిరంతర నిఘా ఉంచి, పక్కరాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళపై అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాలు, రాజకీయ సమస్యలు వంటివాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఈసాక్షి యాప్, డీజీలాకర్‌యాప్ గురించి అధికారులకు వివరించారు. డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచి ఎక్కడికక్కడ సమస్యలు తెలుసుకోవాలన్నారు. పేకాట, మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివాటిపై ప్రత్యేక నిఘా ఉంచి వాటికి అడ్డుకట్టవేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ, గ్రామాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరాతీసి నేరాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేష్, హేమంత్‌కుమార్, ఆదినారాయణ, ఎస్సీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, సైబర్ సెల్ సీఐ తిమ్మారెడ్డి, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.





పాల్గొన్న పోలీసు అధికారులు, మాట్లాడుతున్న ఎస్పీ రత్న



నమో నారసింహా..!

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మాఘమాసం శనివారం సందర్భంగా పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

మేడమ్..! సీఐ నుంచి కాపాడండి

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై ఎస్పీకి మహిళ ఫిర్యాదు



మాట్లాడుతున్న గాయత్రి

పుట్టపర్తిరూరల్/మడకశిరటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పొలం వద్ద గొడవపడ్డ తన బంధువుల తరపున న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వెళితే మడకశిర సీఐ తనతో అసభ్యకరంగా మాట్లాడి, ఇబ్బంది పెట్టాడని మడకశిర మండలం టీడీపల్లి తండాకు చెందిన ఎస్వీ గాయత్రి శనివారం జిల్లా ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మడకశిర మండలం టీడీపల్లిలో తమ బంధువులు పొలం విషయంగా గొడవ పడ్డారన్నారు. దీంతో ఈ నెల రెండో తేదీన పోలీసు స్టేషన్‌కు వెళ్లామన్నారు. సీఐని కలిసి సమస్య వివరించామన్నారు. అయితే మాట్లాడాలని ఉందని, తనను మాత్రమే సీఐ స్టేషన్‌లోకి పిలిపించినట్లు తెలిపారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందిని కూడా బయటకు పంపి, తనను ఒక్కదాన్నే రాత్రి పదిగంటల వరకు విచారించినట్లు తెలిపారు. విచారణలో కేసు గురించి కాకుండా తన వ్యక్తిగత విషయాలు ఆరా తీసినట్లు వివరించారు. అసభ్యకరమైన మాటలతో వేధించినట్లు తెలిపారు. తనను ఎలా ఇబ్బంది పెట్టినది స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే తెలుస్తుందని ఎస్పీకి విన్నవించినట్లు పేర్కొన్నారు. న్యాయం చేయాలని, సీఐ నుంచి రక్షణ కల్పించాలని ఎస్పీని కోరానని గాయత్రి పేర్కొన్నారు.

ఎన్నాళ్లీ క్షోభ..?

దుర్భరంగా చేనేతల జీవితాలు

గిట్టుబాటు ధర లేక అవస్థలు

వృత్తిని వదిలేస్తున్న కొందరు కార్మికులు

ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్



మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు

ధర్మవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా చేనేతల బతుకులు మాత్రం మారడం లేదు. ఇంటిల్లిపాది కష్టపడినా కూలి కూడా గిట్టుబాటు కాకపోవడంతో చేనేత కుటుంబాలు దుర్భర స్థితిలో జీవనం గడుపుతున్నాయి. కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు చేనేతల అభివృద్ధి, సంక్షే మం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పలువురు చేనేత సఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలతో ఓట్లు రాబట్టుకుని, గద్దెనెక్కాక అసలు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. నాలుగు నెలల నుంచి ముడిపట్టు సరుకుల ధరలు కూడా పెరిగాయన్నారు. సపూరి గతంలో రూ.4200 ఉండగా ప్రస్తుతం రూ.6000లకు, వార్పు గతంలో రూ.4500ఉండగా ప్రస్తుతం రూ.6200లకు పెరిగిందన్నారు. అసలే గిట్టుబాటు లేని పరిస్థితుల్లో ముడి సరుకు ధరలు పెరగడం తమను మరింత దుర్భర పరిస్థితిలోకి నెడుతోందని చేనేత కార్మికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అవసరమైన పనిముట్లు, ముడిసరుకు అందించి, ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. చేనేత సొసైటీలకు దరఖాస్తు చేసుకున్నామని, అప్రూవల్ అయితే ముడిసరుకులు సబ్సిడీతో పొందడానికి వీలుంటుందని చేనేత కార్మికులు చెబుతున్నారు. అయితే హ్యాండ్ లూమ్ అధికారులు దరఖాస్తులను అప్రూవల్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు చేనేత కార్మికులు ఆరోపిస్తున్నారు.

గిట్టుబాటు ధరకు కొనేలా చూడాలి

చేనేత కార్మికులు నేసిన ఉత్పత్తులను ఆప్కో సంస్థ ద్వారా గిట్టుబాటు ధరకు కొనేలా చూడాలని చేనేత సంఘాల నాయకులు కోరుతున్నారు. అలాగే సబ్సిడీకి పనిముట్లు, పాసుపుస్తకాలు తదితర వాటిని అందించాలని, ఉచిత బీమాతో పాటు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. చేనేత పరిశ్రమ ముందుకు వెళ్లాలంటే జీఎస్టీ రద్దు చేయాలని కోరుతున్నారు. జీఎస్టీ పెట్టినప్పటి నుంచే చేనేత పరిశ్రమ పూర్తిగా దెబ్బతిందని, ధరలు పెరిగి జీఎస్టీ కట్టలేక మాస్టర్ వీవర్స్ ఇబ్బందులు పడుతున్నారని పలువురు చేనేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24వేలు ఇచ్చేదని, కూటమి ప్రభుత్వం ఆమొత్తన్ని పెంచి ఇవ్వాలని కోరుతున్నారు. చేనేత కార్మిక రంగానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మగ్గానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరుతున్నారు.

ముడి సరుకుల ధర తగ్గించాలి



కరోనా సమయం నుంచి చేనేత పరిశ్రమ కుదేలైంది. నేసిన చీరకు సరైన గిట్టుబాటు ధర రావడంలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం. దీనికి తోడు ముడిసరుకుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. గత ప్రభుత్వంలో ఏడాదికి నేతన్న నేస్తం కింద రూ.24వేలు వచ్చేది. ప్రస్తుతం అది కూడా రాలేదు. కూటమి ప్రభుత్వం ముడిసరుకుల ధరలు తగ్గించడంతోపాటు గిట్టుబాటు ధర కల్పించాలి.

- శ్రీనివాసులు, చేనేత కార్మికుడు, కేశవనగర్

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన చేనేతలను ప్రభుత్వమే ఆదుకోవాలి. రాత్రింబవళ్లు కష్టపడి చీరలు నేస్తే కనీసం గి ట్టుబాటు కూడా రావడంలేదు. దీంతో కుటుంబపోషణ భారమైంది. ఎన్ని ప్రభుత్వాలుమారిన చేనేతల బతుకులు మారలేదు. కార్మికులకు పథకాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి.

- వెంకటేశ్, చేనేత కార్మికుడు

జీఎస్టీ రద్దు చేయాలి

చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉంది. సక్రమంగా పనిలేకపోవడంతో కొందరు కార్మికులు వేరే వృత్తులలోకి వెళ్తున్నారు. మరికొందరు చేనేత రంగం వదిలి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకునేందుకు సబ్సిడీపై పనిముట్లు ఇవ్వాలి. పెరిగిన ముడిసరుకుల ధరలు తగ్గించాలి. జీఎస్టీ రద్దు చేయడంతోపాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- వెంకటనారాయణ, ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి

శ్రమిస్తే ఏదైనా సాధ్యమే

ప్రముఖ పాటల రచయిత చంద్రబోస్

ఘనంగా ఎడిఫై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమేనని ప్రముఖ పాటల రచయిత చంద్రబోస్ పేర్కొన్నారు. మండలంలోని వడియంపేట సమీపంలో ఉన్న ఎడిఫై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రబోస్ హాజరయ్యారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రంగస్థలంలోని పాట పాడి అలరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలను చూస్తుంటే తనకు బాల్యం గుర్తుకొస్తోందన్నారు. తాను చాలా ఇరుకు గదుల్లో చదువుకున్నానని, ప్రస్తుతం ఇలాంటి విశాలమైన పాఠశాలను చూస్తుంటే సంతోషం కలుగుతోందన్నారు. మంచి వాతావరణంలో చదువులు పిల్లల్లో ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, సోషల్ అవెర్నెస్ కార్యక్రమాలు చేపట్టారు.కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ అగర్వాల్, సీఎండీ కామేశ్వరీ, డైరెక్టర్స్ ప్రవీణ్, నవీన్, స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాటల రచయిత సుభాష్ చంద్రబోస్, స్కూల్ యాజమాన్యం

నేడు జాబ్‌మేళా

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు కమలానగర్‌లోని శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు మేళాలో పాల్గొంటాయన్నారు. బీటెక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉంటుందన్నారు. వివరాలకు 90597 23829, 7569033379, 9885738299 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

హంద్రీనీవా ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ఎస్‌ఈగా రాజాస్వరూప్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సూపరింటెండెంట్ ఇంజనీరుగా పని చేస్తున్న ఆయన్ను ఎస్‌ఈగా నియమిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఎస్‌ఈగా ఉన్న దేశేనాయక్ మూడు నెలల కిందట నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ నాగరాజ హంద్రీనీవా ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూవచ్చారు. తాజాగా వచ్చిన ఉత్తర్వులతో స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హంద్రీనీవా కార్యాలయంలో రాజాస్వరూప్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఈఈలు శ్రీనివాస్‌నాయక్, వెంకటేశ్వర్లు శెట్టి, సూపరింటెండెంట్ మల్లికార్జున, ఇంజనీర్లు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్‌ఈకి శుభాకాంక్షలు చెబుతున్న ఇంజనీర్లు, అధికారులు

టీడీపీ నుంచి ఆరుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజక వర్గం పుట్లూరు మండలం కుమ్మనమల పంచాయతీకి చెందిన ఆరుగురు టీడీపీ కార్యకర్తలను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన శీలం పెద్ది రాజు, చితంబరి, మనోహర, సూరి, చిన్న పెద్దిరాజు, సురేష్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సమస్యలను పరిష్కరిస్తున్నా

మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి

ఇంటర్వ్యూ



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనార్టీలకు సంబంధించిన అనేక సమస్యలను ఒక్కొక్కటిగా జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సహకారంతో పరిష్కరిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి అన్నారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలను ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, లోటు పాట్లకు తావులేకుండా న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

ప్రశ్న: బాలికల వసతిగృహంలో మెనూ ఎలా అమలు చేస్తున్నారు?

జవాబు: నేను మైనార్టీ వెల్ఫేర్‌కు రానంత వరకూ విద్యార్థినులకు నెల నెలా డబ్బులు ఇచ్చేవారు. పైస్థాయి అధికారులకు సమస్యను వివరించి మెనూ అమలు చేసేలా చర్యలు తీసుకున్నా.

ప్రశ్న: అనంతలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం ఎంత వరకూ వచ్చింది..?

జవాబు: గతంలో పాఠశాల నిర్మాణానికి రూ. 17 కోట్లు విడుదలయ్యాయి. కొన్ని కారణాల వల్ల నిధులు వెనక్కి వెళ్లడంతో పనులు ఆగాయి. ప్రస్తుతం పైస్థాయి అధికారులు నివేదికలు అడగడంతో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఎస్టిమేషన్‌లు వేస్తున్నారు. పైస్థాయి నుంచి ఏమైనా ఆదేశాలు అందితే నిర్మాణాలు చేపడతాం.

ప్రశ్న: వసతిగృహాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారా..?

జవాబు: వసతిగృహాల్లో అన్ని రకాల వసతులు కల్పించాం. చలికాలం నేపథ్యంలో బెడ్‌షీట్లు అందజేశాం. దోమల బెడద లేకుండా మెష్‌లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల కోసం జిల్లా కలెక్టర్‌కు ఫైలు పంపాం.

ప్రశ్న : కదిరి రెసిడెన్షియల్ పాఠశాల ఎప్పుడు ప్రారంభిస్తారు..?

జవాబు: కదిరి రెసిడెన్షియల్ పాఠశాల గతంలోనే పూర్తయ్యింది. అయితే ప్రారంభం ఆలస్యమైంది. అందుకు సంబంధించి అనుమతులు లభించాయి. త్వరలోనే ప్రారంభిస్తాం.

ప్రశ్న : గుంతకల్లు గురుకుల పాఠశాల పరిస్థితేంటి..?

జవాబు: గుంతకల్లులో అన్ని హంగులతో పాఠశాల సిద్ధంగా ఉంది. అయితే ఉపాధ్యాయుల నియామకం గురించి రాష్ట్రస్థాయి అధికారులకు వివరించాం. అక్కడి నుంచి ఆదేశాలు వస్తే ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను వినియోగంలోకి తెస్తాం.





మట్టిని తొలగించడానికి నీటి తొట్టెలో వేసిన గెనసగడ్డలు.. తరలించేందుకు కోత కోస్తున్న కూలీలు

లాభాల పంట

గెనసగడ్డ సాగుతో ఆదాయం

పెట్టుబడి తక్కువ.. మందులూ అవసరం లేదు..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విరివిగా సాగు

కళ్యాణదుర్గం/కుందుర్పి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పంటలు సాగు చేయాలంటే రైతులు పెట్టుబడులకు భయపడిపోతున్నారు. కూలీల రేట్లు పెరిగిపోయాయి. విపరీతంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సి ఉంటుంది. మధ్యలో తెగులు సోకితే మరింతగా పిచికారీ చేయాల్సి ఉంటుంది. అన్ని వ్యయప్రయాసలకోర్చి పంట పండిస్తే.. మార్కెట్‌లో దళారుల చేతిలో దారుణంగా మోసపోవాల్సిందే. వారు చెప్పిన ధరకే పంట విక్రయించాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటితో విసిగిపోయిన కళ్యాణదుర్గం నియోజకవర్గ రైతులు గెనసగడ్డ సాగు వైపు మొగ్గు చూపారు. ఎకరాకు కేవలం రూ.5 వేలు పెట్టుబడి చాలు. రసాయన ఎరువులు, పురుగు మందులూ అవసరం లేదు. ఒకసారి కలుపు తొలగించుకుంటే చాలు. పంట తొలగించాక దళారుల అవసరం లేకుండా నేరుగా మార్కెట్‌కు తరలించి, రైతులే విక్రయించుకుంటున్నారు. అలా ఎకరాలో రూ.లక్ష ఆదాయం పొందుతున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. వాణిజ్య పంటలు సాగుచేసి, నష్టపోయిన తాము గెనసగడ్డ పంట పెట్టి లాభాలు చూస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 200 ఎకరాల్లో పంట సాగు చేశారు.

విత్తనం కొనాల్సిన అవసరం లేదు..

కర్ణాటక ప్రాంతంలో గెనసగడ్డ సాగు చేస్తున్నారు. పైన తీగలా పెరుగుతుంది, భూమి లోపల వేర్లలో కందలా గెనసగడ్డ అభివృద్ధి చెందుతుంది. పంట పూర్తయ్యాక తీగలను తీసుకెళ్లి, మరో పొలంలో సాగు చేసుకోవచ్చు. విత్తనాల ఖర్చులు కూడా ఉండవు. ఇలా కర్ణాటక నుంచి తీగలను తీసుకొచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పంట సాగు చేస్తున్నారు. కొద్దిపాటి నీరు చాలు. డ్రిప్పు సౌకర్యంతో సులభంగా పంటను సాగు చేసుకోవచ్చు. ఏ మాత్రం మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. ఒకసారి కలుపు తొలగించుకుంటే చాలు. మూడు నెలల్లో పంట దిగుబడి వస్తుంది. ఒక్కో రైతు 4 నుంచి 5 ఎకరాల దాకా సాగు చేస్తున్నారు.

4 ఎకరాల్లో రూ.4 లక్షలు వచ్చింది



నాకున్న నాలుగెకరాల్లో గెనసగడ్డ సాగు చేశా. పంట కోసి, బెంగళూరు మార్కెట్‌కు తీసుకెళ్లి, విక్రయించా. రూ.4లక్షల వరకు ఆదాయం వచ్చింది. మరో మూడెకరాల్లో పంట సాగులో ఉంది. త్వరలోనే ఆ పంట కూడా కోతకు వస్తుంది. ఇన్నేళ్లపాటు వాణిజ్య పంటలు సాగుచేసి నష్టపోయాం, అప్పులపాలయ్యాం. గెనసగడ్డ సాగుతో లాభాలు గడిస్తున్నాం.

- శివన్న, కరిగానిపల్లి, కుందుర్పి మండలం


పచ్చదనంతో కళకళలాడుతున్న గెనసగడ్డ పంట

దళారుల బెడద అసలే లేదు..

పంట ఒకేసారి కోతకు వస్తుంది. రైతులే స్వయంగా 30 నుంచి 40 కేజీల వరకు వరకు బస్తాల్లో ప్యాక్ చేస్తారు. బెంగళూరు మార్కెట్‌కు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుని, తరలిస్తున్నారు. దీంతో దళారుల బెడద అసలే ఉండదని రైతులు చెబుతున్నారు. ఆరోజు మార్కెట్ రేటును బట్టి విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. 30 కిలోల ప్యాకెట్లలో ప్యాక్ చేసి, బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఎకరాకు వంద ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో ప్యాకెట్ రూ.వెయ్యికిపైగానే ధరతో అమ్ముడుపోతోంది. దీంతో పెట్టుబడి రూ.5 వేలుపోను ఎకరాలో రూ.లక్ష వరకు ఆదాయం వస్తున్నట్లు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూమికీ మేలు..

ఇన్నాళ్లపాటు వాణిజ్య పంటలు సాగు చేసి రసాయన ఎరువులు, పురుగు మందులు ఇష్టానుసారంగా పిచికారీ చేయడంతో భూసారం దెబ్బతింటోంది. ఏ పంట కూడా చేతికి అందే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గెనసగడ్డ వైపు రైతులు మళ్లారు. ఒక్కసారి కూడా మందు పిచికారీ చేయాల్సిన అవసరం లేకపోవడంతో భూమి ఏ మాత్రం కలుషితం కావట్లేదు. సారవంతమవుతోంది కూడా. కూలీల అవసరం కూడా లేదు.

గెనసగడ్డ సాగు ఎంతో మేలు



వాణిజ్య పంటలు సాగు చేసి, నష్టపోయాం. 3 ఎకరాల్లో గెనసగడ్డ సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగా ఉంది. మరో పది రోజుల్లో కోతకు వస్తుంది. అప్పుల నుంచి ఉపశమనం దక్కే అవకాశం ఉంది.

-ఈరన్న, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

11 మద్యం దుకాణాలకు 63 దరఖాస్తులు

రేపు జడ్పీ సమావేశపు హాల్‌లో లాటరీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలకు గీత కులస్థుల దరఖాస్తు గడువు శనివారం ముగిసింది. ఇదివరకు ఈ ఏడాది జనవరి 27వతేదీ నుంచి ఈనెల 5వతేదీ వరకు గడువు ఇచ్చా రు. అప్పటి దాకా ఎవరు దరఖాస్తు చేసుకోకపోవడంతో శనివారం వరకు గడువు పొడిగించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు జిల్లాలోని 11 మద్యం షాపులకు 63 మంది గీత కులస్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 10న ఉదయం 9 గంటలకు జడ్పీ సమావేశపు హాల్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తామని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

దరఖాస్తుల దాఖలు ఇలా..

జిల్లాలో 14 మద్య దుకాణాలను గీత కులస్తులకు కేటాయించారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో 11 మంది దరఖాస్తు చేసుకు న్నారు. గుంతకల్లు మున్సిపాలిటీలో 18 మంది, తాడిపత్రి మున్సిపాలిటీలో 1, రాయదుర్గం మున్సిపాలిటీలో 1, కంబదూరు మండలంలో 1, గుమ్మఘట్ట 1, గుత్తి మున్సిపాలిటీ 11, గుంతకల్లు రూరల్ మండలంలో 4, బెళుగుప్ప మండలం 10, రాప్తాడు మండలం 2, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 3 దరఖాస్తులు వచ్చాయి. డి.హీరేహాళ్, రాయదుర్గం రూరల్ మండలం, గుత్తి రూరల్ మండలాల్లో ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు.

నాలుగు చోట్ల ఒక్కొక్కటే

మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజులో గీత కులస్తులకు 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో తాడిపత్రి, రాయదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట మండలాల్లో ఒక్కో దుకాణానికి ఒక్క దరఖాస్తు మాత్రమే రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రాజకీయ నేతల ప్రోద్బలంతోనే ఈ వ్యవహారం నడిచిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణానికి ఒక్క దరఖాస్తు వేసిన వారి పేరుపై లాటరీ తీసి నిబంధనల మేరకు అన్ని సవ్యంగా ఉంటే వారికే దుకాణాన్ని కేటాయిస్తామని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.





ఆదిమూర్తినగర్‌లోని దివ్యశ్రీ ఆస్పత్రి ఎదురుగా మరో చిన్నపిల్లల ఎస్సీ వసతి గృహం ఉంది. అరెకరాలో విశాలమైన భవనాన్ని ఏర్పాటు చేశారు. 400 మందికిపైగా విద్యార్థులు వసతి పొందేలా నిర్మించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న సమయంలో రెండు వసతిగృహాలను ఆ భవనంలోనే నిర్వహించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాను రాను రాష్ట్రశాఖ నుంచి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన నిధులు రాకపోవడం, చేతినుంచి ఖర్చులు పెట్టుకోలేక వార్డెన్లు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ శాఖ అధికారులు.. వసతిగృహాన్ని ఐదేళ్ల క్రితం మూత వేశారు.

ఆదిమూర్తినగర్‌లో మూతపడిన ఎస్సీ బాలుర వసతి గృహం

పాతబడితే మూతే..!



శిథిలావస్థలో సంక్షేమ వసతి గృహాలు

నిర్వహణకు నిధులు కరువు

కొత్తగా కట్టాలంటే రూ.కోట్లు కావాలి..

మూత వేసిన అధికారులు

అద్దె భవనాల్లో హాస్టళ్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలున్నా.. ప్రైవేటు వాటిలో రూ.లక్షల్లో అద్దెలు చెల్లించి వసతిగృహాలు నిర్వహించాల్సిన దుస్థితిని సంక్షేమ శాఖలు ఎదుర్కొంటున్నాయి. ఎకరాల్లో భూములు... విశాలమైన భవంతులు ఉ న్నా ఆలనాపాలనా కరువవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. పైస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలియజేస్తున్నా... అంచనాలు సిద్ధం చేసి పంపుతున్నా.. స్పందన కరువైందని జిల్లా యంత్రాంగం పేర్కొంటుండటం గమనార్హం. ఆ భవనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.కోట్లలో ఖర్చవుతుండటం, గత ప్రభుత్వాల నుంచి ఆ మేరకు స్పందన లేకపోవడంతో ఆయా సంక్షేమశాఖల రాష్ట్ర అధికారులు సైతం మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ప్రతి నెలా ఒక్కో హాస్టల్‌కు రూ.40 వేల నుంచి రూ.60 వేలకుపైగా అద్దెలు చెల్లిస్తూ ప్రైవేటు భవనాల్లో వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు పదుల సంఖ్యలోనే మూతపడినట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాలు ఉండి కూడా... వాటిని వినియోగంలోకి తీసుకురాలేక అద్దె భవనాల్లో ఉండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా మూతపడిన ఆయా వసతిగృహాలకు మోక్షం కలుగుతుందో.. లేదో.. చూడాలి.

ఏళ్లుగా నిరుపయోగం...

బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల పరిధిలోని పలు వసతి గృహాలు ఏళ్లుగా నిరుపయోగంగా మారాయి. ఆ భవంతుల పునఃనిర్మాణాలకు రూపాయి కూడా నిధులు రాకపోవడంతో శిథిలమైన వసతిగృహాల్లో ఉండలేక... ప్రైవేటు భవనాల్లోకి మార్చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం వెనుకవైపునున్న బాయ్స్ కాలేజీ హాస్టల్ ఐదేళ్ల క్రితం శిథిలం కావడంతో మూత వేశారు. నగర నడిబొడ్డున అదికూడా ఎకరా స్థలం... విశాలమైన భవనాన్ని అభివృద్ధి చేయలేక మూతవేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ వసతిగృహంలో 8 గదులు, లైబ్రరీ రూమ్, రీడింగ్ రూమ్, వంటశాల, డైనింగ్ హాల్, వార్డెన్ అధికారి గదితో పాటు... విశాలమైన పరిసరాలు ఉన్నాయి. ఇందులో 300 మందికిపైగానే విద్యార్థులు వసతిపొందే వెసులుబాటు ఉండేది. ఆలనాపాలనా కరువవడంతో అధికారులు మూతవేశారు.

☛ కణేకల్లులోని బాలికల వసతిగృహాన్ని నాలుగేళ్ల క్రితం మూతవేశారు. గతంలో మెయింటెనెన్స్ ఫండ్ కోసం రాష్ట్రశాఖకు జిల్లా అధికారులు కుప్పలుతెప్పలుగా నివేదికలు పంపినా... చెత్తబుట్టకు పరిమితమయ్యాయనడంలో సందేహం లేదు. ఆ క్రమంలోనే ఆ వసతిగృహాన్ని మూతవేసి అందులో ఉన్న విద్యార్థినులను స్థానికంగా పలు బీసీ, ఎస్సీ, మోడల్ స్కూళ్లకు పంపినట్లు తెలుస్తోంది. ఈ వసతిగృహం దాదాపు అరెకరం విస్తీర్ణంలో ఉంది. విద్యార్థుల వసతి కోసం 9 గదులు, వంటశాల, డైనింగ్, రీడింగ్ రూములు మరో నాలుగు గదులు నిర్మించారు. పైకప్పు పెచ్చులూడటం, వర్షాలు కురిసిన సమయం లో నీరు వసతిగృహంలోకి ఉట్టిపడుతుండటంతో ఆ శాఖ అధికారులు మూతేశారు.

☛ గుత్తిలో ఆరేళ్ల కిందట రెండు బాలుర వసతి గృహాలను మూతేశారు. మూడేళ్ల కిందట బాలికల కాలేజీ వసతిగృహం పూర్తిగా శిథిలమవడంతో క్లోజ్ చేశారు. గుత్తి నడిబొడ్డున ఉన్న ఆ వసతిగృహం ఆలనాపాలనా కరువవడంతో మూతేశారు. అందులో ఉన్న విద్యార్థినులను పలు వసతిగృహాల్లోకి పంపినట్లు తెలిసింది. ఈ వసతిగృహం దాదాపు అరెకరం విస్తీర్ణంలో ఉంది. 7 వసతి గదులు, విశాలమైన పరిసరాలతో ఏర్పాటైన వసతిగృహం మూతపడింది.

☛ మరూరులోని బీసీ వసతిగృహం ఆరేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని మూతేశారు. దీంతో ఆ భవనం శిథిలావస్థకు చేరిపోయింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో... ఆ ప్రాంత ప్రజల నుంచి హాస్టల్‌ను పునఃనిర్మించాలని డిమాండ్ వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ☛ యాడికిలోని బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. ఐదేళ్ల క్రితం భవనం శిథిలావస్థకు చేరుకున్నపుడు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో మూత వేయాల్సి వచ్చింది.

☛ గుత్తిలోని మరో బాలికల వసతిగృహం మూతపడింది. ఆ హాస్టల్‌ను తెరవాలని సమీప ప్రాంత ప్రజల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని రాష్ట్రసాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యమనే చెప్పాలి.

రూ.కోట్లల్లో ఖర్చవుతుండటమే కారణం

బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల పరిధిలో మూతపడిన ప్రభుత్వ భవనాలకు మరమ్మతులు చేయాలన్నా, వాటిని పడగొట్టి కొత్తవి నిర్మించాలన్నా రూ.కోట్లల్లో ఖర్చవుతుండటంతోనే రాష్ట్ర అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని రెండు ఎస్సీ వసతిగృహాలకు మరమ్మతులు చేయాలన్నా, కొత్తవి నిర్మించాలన్నా రూ.5 కోట్ల వరకూ ఖర్చయ్యే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు. ఈ లెక్కన గుత్తి, కణేకల్లులోని వసతిగృహాలకు సైతం పూర్వవైభవం తీసుకురావాలంటే రూ. 2 కోట్ల వరకూ ఖర్చవుతుందని తెలుస్తోంది. మరూరు, యాడికి, గుత్తిలోని బీసీ వసతిగృహాలకు మరమ్మతులు చేయాలంటే రూ.5 కోట్ల వరకూ వెచ్చించాల్సిన ఉందట. అంత మొత్తంలో నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టే సాహసాన్ని ఆ శాఖ రాష్ట్ర అధికారులు చేయలేకపోతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో... శిథిలమైన భవనాలు మూతవేసి విద్యార్థులను అడ్జస్ట్‌మెంట్‌తో సరిపెడుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే... వారి కోసం ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.


ఎస్సీ సంక్షేమ శాఖ వెనక వైపు మూత పడిన ఎస్సీ బాలుర వసతి గృహం

స్టాంపు వెండర్ల మాయాజాలం..!

రూ.100 స్టాంపు రూ.200కు విక్రయం

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనిపించని స్టాంపులు



అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రూ.100 స్టాంపును రూ.200కు విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల అది ఇంకా పైచిలుకే పలుకుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో స్టాంపు వెండర్లు మాయాజాలం చేస్తున్నారు. ఈ స్టాంపులున్నా ఎక్కువ మంది నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గు చూపుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్టాంపుల విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తిగా పక్కన పెట్టేశారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు దొరకడం లేదు. బయట మాత్రం రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలిసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొందరు పాత తేదీల కోసం ఈ స్టాంపులను రహస్యంగా ఉంచుకుంటారు. అవసరమైన వారికి రూ.వేలల్లో చెప్పి అమ్మేస్తుంటారు. అందుకే ఈ స్టాంపులకు మరింత డిమాండ్ ఉంటుంది.

నెలన్నరలో రూ.40 లక్షల స్టాంపులు...

రెండు నెలల క్రితం సుమారు రూ.40 లక్షల విలువైన రూ.50 ముఖ విలువ, రూ.100 ముఖ విలువ కలిగిన స్టాంపులు వచ్చాయి. జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వాటిని పంపించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టాంప్ వెండర్లకు అందజేశారు. నెలన్నర వ్యవధిలోనే అవన్నీ పూర్తయ్యాయని చెబుతున్నారు. ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోనూ రూ.50, రూ.100 స్టాంపులు దొరకడం లేదు. కేవలం స్టాంపు వెండర్ల వద్ద మాత్రమే ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా స్టాంపుల కోసం వెళ్తే రూ.50 స్టాంపులు రూ.100కు, రూ.100 స్టాంపులు రూ.200కు విక్రయిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సమీపాల్లోనే ఇలా అమ్ముతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఇంకా రూ.10, రూ.20 ముఖ విలువ కలిగిన స్టాంపులు రానే లేదు. మరోసారి ఇండెంట్ పంపినట్లు చెబుతున్నారు. మరోసారి స్టాంపులు రావడానికి ఇంకా వారం నుంచి పది రోజుల సమయం పట్టే అవకాశముంది.

స్టాంపువెండర్ల ఇష్టారాజ్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ-స్టాంపుల మీదే ఆధారపడాల్సి వచ్చేది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఉండేవి కావు. గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లభ్యమైనంత కాలం స్టాంపు వెండర్లదే హవా. కొంతకాలం క్రితం వరకు డాక్యుమెంట్ల కోసం స్టాంపులను ఉపయోగించేవారు. వీటికి భారీగానే వసూలు చేసేవారు. ఇప్పుడు కూడా అదే క్రమంలో స్టాంపు వెండర్లు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను వాడేస్తున్నారు. అధిక ధరలకు విక్రయించేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లేవనే సాకుతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. స్టాకు రాగానే ఎక్కువ స్టాంపులు తమకే అందేలా వ్యవహారం నడుపుతారు. అందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముడుపులు అప్పగించి సొంతం చేసుకుంటున్నారని సమాచారం. త్వరలో రానున్న స్టాంపుల విషయంలోనైనా అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోతే అధిక భాగం స్టాంపు వెండర్ల చేతిలోకి వెళ్లడం ఖాయం.


రామ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మిగిలేవి ఎన్నో..?

స్కూళ్లకు కొత్త రూపమా...శాపమా..?

అనంతపురం రూరల్ మండలంలోని విద్యారణ్యనగర్‌లో యూపీ స్కూల్ ఉంది. ఇందులో 1 నుంచి 5వ వరకూ 95 మంది విద్యార్థులు, 6,7,8 క్లాసుల్లో 84మంది విద్యార్థులున్నారు. 117 ప్రత్యామ్నాయ నిబంధనల మేరకు విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువ ఉన్నట్లైతే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి. కానీ వసతులు లేవన్న కారణాలు చూపి ఈ స్కూల్‌ను కాదని సమీపంలోని పాపంపేట స్కూల్‌లో కొన్ని టీచర్ పోస్టులు కాపాడేందుకు ఇక్కడి 84 మంది విద్యార్థులను రోడ్డు దాటించి పాపంపేట స్కూల్‌లో కలపాలని చూస్తున్నారు. యూపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు పిటిషన్ ఇచ్చినా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

- పాఠశాలలు, పోస్టుల పునర్నిర్మాణం
- 117 రద్దుకు కూటమి సర్కారు శ్రీకారం
- 'ప్రత్యామ్నాయం' పేరుతో పునర్నిర్మాణానికి కసరత్తు
- ఐదు రకాలుగా పాఠశాలల వర్గీకరణ
- యూపీ స్కూళ్లు, సబ్జెక్టు టీచర్లకు దెబ్బ : సంఘాల నేతలు

స్కూళ్లను దెబ్బతీసేలా నిర్ణయం

ప్రస్తుతం విద్యాశాఖ నిర్ణయాల వల్ల ప్రధానంగా అప్పర్ ప్రైమరీ స్కూళ్లు చాలా వరకూ దెబ్బ తింటాయన్న అభిప్రాయం మెజార్టీ టీచర్ల నుంచీ వస్తోంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో విద్యార్థుల డ్రాపౌట్లు కూడా పెరుగుతాయని సామాన్య టీచర్లు విద్యాశాఖ తీరుపై మండిపడుతున్నారు. స్కూళ్లను నాడు జగన్ ఒక రకంగా దెబ్బతీస్తే... నేడు కూటమి ప్రభుత్వం మరో రకంగా దెబ్బతీసేలా ఉందంటూ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మా పోస్టు ఉంటుందా? ఊడుతుందా..? ఉన్న స్కూల్ అలాగే ఉంటుందా...? అప్‌గ్రేడ్ అవుతుందా..? లేక డీగ్రేడ్ అవుతుందా..?, రాష్ట్రవ్యాప్తంగా టీచర్లు, ప్రధానోపాధ్యాయుల్లో ఇప్పుడు ఇదే చర్చ. స్కూళ్లు, పోస్టులు ఉండేనా, ఊడేనా అంటూ ఎవరి స్థాయిలో వారు గందరగోళానికి గురవుతున్నాయి. గతంలో జగన్ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చింది. దీనిపై టీచర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో కూటమి సర్కారు 117 రద్దుకు నడుం బిగించింది. విద్యాశాఖ జీవో 117 రద్దు చేస్తూ అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. క్షేత్రస్థాయిలో స్కూళ్ల స్వరూపాలను మార్చేందుకు 117 ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పేరుతో ప్రాథమిక కసరత్తు మొదలెట్టింది. గత 15 రోజులుగా ప్రాథమిక కసరత్తు చేసి, ఓ కొలిక్కి తెచ్చారు. జగన్ ప్రభుత్వం 117 తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను దెబ్బతీస్తే, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేసే నెపంతో యూపీ స్కూళ్లను దెబ్బతీస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సర్‌ప్లస్‌గా చూపి ఎస్జీటీలను అవసరం ఉన్నట్లుగా చూపే యత్నాలు సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కసరత్తు ముమ్మరం

గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 117ను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమైంది. జనవరి నెలలో విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులిచ్చారు. గత నెల 24న జిల్లా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ స్కూళ్ల పునర్నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యాశాఖాధికారులు, ఐటీ సెల్ స్టాఫ్ గత 15 రోజులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. మొదట స్కూళ్లలోని బోగస్ రోల్ ఏరివేతకు నడుం బిగించారు. 2024 డిసెంబరు 31నాటికి స్కూళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్నారు. కొత్త తరహా స్కూళ్ల ఏర్పాటుకు ప్రాథమికంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, యూపీ స్కూళ్లు, హైస్కూళ్లుగా వర్గీకరించుకుని వాటికి సరిపడా టీచర్లు, విద్యార్థుల వివరాలను రూపొందిస్తున్నారు. ప్రాథమికంగా అంచనా ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనల ముసాయిదాను సిద్ధం చేసి త్వరలో కలెక్టర్ ముందు ఉంచనున్నారు. తర్వాత కలెక్టర్ అన్ని మండలాల వారీగా పరిశీలించనున్నారు. ప్రజా ప్రతినిధులు నుంచి కూడా స్కూళ్ల పునర్నిర్మాణంపై అభిప్రాయం తీసుకోనున్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే....మార్పులు చేర్పులు చేయించి, తర్వాత ప్రతిపాదనలను విద్యాశాఖ ఆమోదానికి పంపనున్నారు.



విద్యారణ్యనగర్ యూపీ స్కూల్

స్కూల్ టైప్	కొత్త స్కూళ్ల సంఖ్య
ఫౌండేషన్ స్కూళ్లు	127
బేసిక్‌ప్రైమరీ	584
మోడల్ ప్రైమరీ	644
యూపీస్కూళ్లు	23
హైస్కూళ్లు	271

కలెక్టర్‌కు త్వరలో ప్రతిపాదనలు



విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 117జీవో రద్దు తర్వాత ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా కసరత్తు జరుగుతోంది. ఇదే ఫైనల్ కాదు. ప్రాథమికమైన పని మాత్రమే. గత డిసెంబరు 31 రోల్ ఆధారంగా స్కూళ్ల ప్రతిపాదనల డ్రాఫ్ట్ సిద్ధం చేస్తున్నాం. ఒకటి లేదా రెండు రోజుల్లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

డ్రాపౌట్లు పెరిగే ప్రమాదం



విద్యార్థుల సంఖ్య 60కి పైగా ఉన్న అప్పర్‌ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా, 60కి తక్కువ ఉంటే బేసిక్ ప్రైమరీగా మారుస్తున్నారు. పైగా 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కలపడం వల్ల దూరంగా ఉండే స్కూళ్లకు వెళ్లలేక డ్రాపౌట్లు పెరిగే ప్రమాదం ఉంది. 5వ తరగతి పూర్తయిన తర్వాత మూడు, 5 కిలోమీటర్లు దూరం వెళ్లేందుకు విద్యార్థులు సుముఖత చూపరు. యూపీ స్కూళ్లను కొనసాగించడంతోపాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని ఏపీటీఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నాం.

- సిరాజుద్దీన్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

విద్యార్థులకు ఇబ్బందే



రెండు, మూడు గ్రామాలకు ఒక పాఠశాల పెట్టడం వల్ల ప్రాథమిక విద్యార్థులు వెళ్లలేక ఇబ్బందులు పడతారు. గ్రామీణ విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదమూ ఉంది. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో టీచర్లు ఎక్కువగా పెట్టడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆశిస్తున్నాం. మరోవైపు విద్యార్థులకు రవాణా వ్యయం అందిస్తామంటున్నారు. ఇది అమలు చేయడంలో అనేక అవాంతరాలు ఏర్పడతాయి. విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి.

- వీరప్ప, బీసీటీఏ, రాష్ట్ర అధ్యక్షుడు

జీవో 117 విద్యావ్యవస్థకు క్యాన్సర్

గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 విద్యా వ్యవస్థకు క్యాన్సర్ వంటిది. ఇది విద్యా వ్యవస్థను పూర్తిగా తినేసింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రద్దు చేస్తామని చెప్పి...ప్రత్యామ్నాయ చర్యలు అంటున్నారు. ఇది ఒక రకంగా గాయాలకు మందు పూయడం వంటిదే. కొత్త ప్రభుత్వం విద్యాశాఖను గాడిన పెట్టాలనుకుంటే జీఓ 117ను పూర్తిగా రద్దు చేయాలి. అదేవిధంగా పూర్వపు ప్రైమరీ, యూపీ హైస్కూల్ విధానాన్ని అమలు చేయాలి.

- ఒంటేరు శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు



దత్తతత్వం అందరికీ అర్థం కాదు

మైసూరు దత్తపీఠం ఉత్తరోత్తర పీఠాధిపతి విజయానందతీర్థ స్వామీజీ


అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామి

పామిడి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దత్తతత్వం అందరికీ అర్థం కాదని, త్వరగా ఎవరికీ బోధపడదని మైసూరు దత్తపీఠం ఉత్తరోత్తర పీఠాధిపతి విజయానందతీర్థ స్వామీజీ పేర్కొన్నారు. పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ముందుగా అనఘా ఆత్రేయ దత్తుడికి, కార్యసిద్ధి వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాల మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఉపన్యసించారు. జ్ఞానమూర్తి, సీతమ్మ దంపతుల కృషి ఫలితంగానే పామిడిలో దత్త క్షేత్రం ఏర్పాటు అయ్యిందన్నారు. దత్తుడికి పరీక్షలు పెట్టడం ఇష్టం.. ఆ పరీక్షల్లో భక్తులను గెలిపించడం ఎంతో ఇష్టమన్నారు. అదే దత్తతత్వమన్నారు. ఎక్కడా లేని విధంగా పామిడి దత్త క్షేత్రంలో నవగ్రహాలు సతీసమేత వాహన రూపంలో ప్రతిష్ఠించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ నవగ్రహాలతో గ్రహ బాధలు, గ్రహ దోషాలు ఉండవన్నారు. ప్రతి భక్తుడు ధార్మికతను, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. భగవద్గీత పఠనం అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహకులు శ్రీధర్, ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీరాములు, నారాయణస్వామి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ చేసిన ముఠా అరెస్ట్

3 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

రాప్తాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి, డబ్బు కోసం ఆలయాల్లో చోరీ చేసే వారిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం కురుగుంట్లకు చెందిన కూరుపాటి సాయికుమార్, అక్కంపల్లి గ్రామానికి చెందిన కనుముక్కల చాంద్‌బాషా, ఎ. నారాయణపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్‌సర్దార్‌వలి, బళ్లారి బైపాస్ ఎల్‌బీ నగర్‌కు చెందిన భగవన్ సాదిక్‌బాషాలు ముఠాగా ఏర్పడి దేవాలయాల్లో దేవుళ్ల ఆభరణాలు దొంగలించేవారని తెలిపారు. శింగనమల చెరువు వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో, దుర్గమ్మ దేవాలయంలో, గురుగుంట్ల చౌడేశ్వరి ఆలయంలో, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్లపల్లి గంగమ్మ దేవాలయంలో, పి. యాలేరు గ్రామంలోని అక్కమ్మ దేవాలయంలో, నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామంలోని కుంటాలమ్మ దేవాలయంలో దేవుళ్లకు అలంకరించిన పలు రకాల ఆభరణాలు చోరీ చేశారన్నారు. ఇలా దాదాపు 3 కిలోల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అందిన ఫిర్యాదుల మేరకు నిందితుల కోసం గాలించామన్నారు. కాగా నిందితులు శనివారం లోలూరు క్రాస్ వద్ద శ్రీరామ్ ఆటో ఫైనాన్స్ గోడౌన్ పక్కన ఉండగా శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్ కుమార్, గార్లదిన్నె, నార్పల పోలీస్ సిబ్బంది చాకచక్యంగా దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మూడు కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నా మన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా : ఫిబ్రవరి 9: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్సనందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలా నగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి వైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమరెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

చీనీ టన్ను రూ. 21వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 10వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైతుల మధ్య భూ వివాదం

దుక్కి చేస్తుండగా వాగ్వాదం...పురుగుల మందు తాగిన ఓ రైతు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య భూ వివాదం కారణంగా ఒక రైతు పొలంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. సీకే పల్లి మండలం న్యామద్దలలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, న్యామద్దలకు చెందిన రాము పేరిట సర్వే నంబరు 403-3ఏలో 3-12 ఎకరాలు, 403-5ఏలో 1-28 ఎకరాలు ఉంది. అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంకు 403-3బీ, 403-5బీ సర్వే నంబర్లలో 4.50 ఎకరాల భూమి ఉంది. ఎవరి భూములను వారు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. కానీ, రాము సాగు చేస్తున్న భూమి సుబ్రమణ్యందని, సుబ్రమణ్యం సాగు చేస్తున్న భూమి రాముదని కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రాము సోదరుడు శివ ట్రాక్టర్‌తో శనివారం దుక్కి చేస్తుండగా, సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. శివ పొలంలోనే పురుగులమందు తాగాడు. అక్కడ ఉన్నవారు అడ్డుకుని పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న శివను కుటుంబ సభ్యులు సీకే పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువులు, కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు వచ్చారు. సరిగా వైద్యం చేయలేదని డ్యూటీ డాక్టర్ జీవన్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. పొలంలో శివ విషం తాగాడని, కానీ డాక్టర్ తాగలేదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి భూ వివాదం గురించి స్థానికులను విచారించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదు స్వీకరించామని, విచారించి చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శ్రీధర్ తెలిపారు.


విలపిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో స్పృహతప్పి పడిపోయిన శివ

జనగణన కాదు.. కుల గణన చేయాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు డి. జగదీశ్

గుంతకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణన కంటే కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ అన్నారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణలో కులగనణ పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చారని అన్నారు. కుల గణన వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కుల గణన వల్ల అణగారిని కులాలు, కుల వృత్తుల వారి గణాంకాలు తెలుస్తాయని, వాటి ఆధారంగా సంక్షేమ పథకాలను వర్తింపజేయవచ్చని అన్నారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు ద్వారా వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని అన్నారు. కుల గణన విషయంగా ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ నెల 12న సీపీఐ ఆధ్వర్యంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్, మహేశ్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కనగానపల్లి/రాయదుర్గం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు.

కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుంతకల్లుకు చెందిన శివ(28) మృతిచెందాడు. బంధువుల పెళ్లికి బైక్‌పై తల్లిమడుగులకు వస్తుండగా, శుక్రవారం రాత్రి మామిళ్లపల్లి వద్ద పెట్రోల్ అయిపోయింది. దీంతో దాదులూరు సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి పెట్రోల్ తీసుకువస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ శివ అక్కడే మృతిచెందాడు. కనగానపల్లి ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాయదుర్గం శివారులోని పైతోట వద్ద శనివారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాయదుర్గం పట్టణానికి చెందిన షేక్ ఇబ్రాహీం(48) మృతి చెందాడు. కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి రాయదుర్గం వైపు వస్తున్న ఆటోకు కుక్క అడ్డు వచ్చింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. డ్రైవర్ ఇబ్రహీం తీవ్రంగా గాయపడగా, ప్రయాణికుడు రెహమాన్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఇబ్రహీం మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

902 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 902 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 463 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

కన్నుల పండువగా ఉమా త్రిలింగేశ్వరస్వామి కల్యాణం


పూజల్లో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసవన్నకట్ట వీధిలో వెలసిన త్రిలింగేశ్వరాలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకుని శనివారం ఉమా త్రిలింగేశ్వరస్వామి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితులు రాఘవశర్మ, విజయ్‌కుమార్‌శర్మతో పాటు వారి శిష్యబృందం ఆధ్వర్యంలో గంగపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాసశుద్ధ ఏకాదశి రుద్రాభిషేకాలు, అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక అహ్వానితులుగా హాజరై కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

ముగిసిన కల్యాణోత్సవం


వసంతోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ధర్మవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు. వేలాది మంది కుల బాంధవుల నడు వసంతోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం శయనోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా అర్చకులు నిర్వహించారు. పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు పుత్తారుద్రయ్య, జింకా నాగభూషణ, మేటికల బాలకుళ్లాయప్ప, భాస్కర్, వెంకటరామయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, గంగాధర్, నరేంద్ర, గోవిందు, పురుషోత్తం, ప్రకాశ్, మోహన్, చంద్రశేఖర్, యాదవరాము, మార్కండేయ, ధనుంజయ పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలు..


అలంకరణలో తిక్కనారాయణస్వామి

ధర్మవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలసిన అవధూత తిక్కనారాయణ స్వామి 53వ ఆరాధన మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానంచేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


రూ.లక్ష నగదును అందజేస్తున్న సంధారాఘవ

ధర్మవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామాపురంలో వెలసిన జానకీరాముల ఆలయ అభివృద్ధికి టీడీపీ నాయకుడు సంధారాఘవ రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు శనివారం సంధారాఘవను కలిసి ఆలయ అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరగా ఆయన విరాళాన్ని అందజేశారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

బుక్కపట్నం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయంలో శనివారం మాఘ భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రత్యేకాలంకరణ చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం, పుస్తక పఠనం, భీష్మ చరిత్ర, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

ధర్మవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులపై పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపణలు అవాస్తవమని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు అన్నారు. మున్సిపల్ బీఎస్‌ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో క్రమశిక్షణకు మారు పేరు అని, విద్యార్థుల ఉత్తీర్ణతలో ప్రథమస్థానంలో ఉందన్నారు. ఇటీవల పదో తరగతి విద్యార్థిని ప్రసవం విషయంలో విద్యార్థిసంఘాల నాయకులు ఉపాధ్యాయులపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. గతంలో కూడా ఇదే విద్యార్థి సంఘం నాయకుడు డబ్బులు డిమాండ్ చేశారని ఉపాధ్యాయులు తెలియజేశారని తల్లిదండ్రులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యార్థిసంఘం నాయకులు మంజుల నరేంద్రపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికే పబ్లిక్ గ్రీవెన్స్

- వైసీపీ భూ ఆక్రమణలు వెలుగులోకి..
- వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశం
- కళ్లుండీ చూడలేని వైఎస్ జగన్
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ భవనంలో శనివారం ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. పట్టణానికి చెందిన మైనార్టీ మహిళలు సుమియా, హసీనా తమ 4.50 సెంట్ల భూమిని వైసీపీ నేతలు, న్యాయవాది జాఫర్‌ఖాన్, రఘునాథ్‌రెడ్డి, నాగిరెడ్డి కబ్జా చేశారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా, చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే వీటిపై విచారణచేసి, కబ్జాకు పాల్పడినవారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్లు, రేషన్‌కార్డులతో ప్రజలు అధిక సంఖ్యలో వినతులు అందించారు. ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు విన్నవించారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే అక్కడిక్కడే పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతల భూ అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం ప్రజలకోసం ఆలోచిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందన్నారు. పోలవరం, అమరావతి పనులకు నిధులు కేటాయిస్తోందన్నారు. కళ్లుండి చూడలేని నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమమే అభివృద్ధిగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పొలప్ప, మండలస్థాయి అధికారులు, ప్రజలు కూటమినాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రజలు తగిన తీర్పు ఇచ్చారు: మాజీ మంత్రి


పుట్టపర్తిలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చేసే బీజేపీకే ఢిల్లీ ప్రజలు పట్టం కట్టారని మాజీమంత్రి పల్లెరఘునాథరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యేక్యాంపుకార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రదానమంత్రి నరేంద్రమోదీ పాలనపై ప్రజలు ఎంతో నమ్మకముంచి అత్యధిక స్థానాలను అందించిన ఢిల్లీప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 27 ఏళ్ల తర్వాత బీజేపీ విజయం సాధించడం సంతోషదాయకమన్నారు.

సంబరాలు: దేశరాజధాని ఢిల్లీలో బీజేపీ అఖండ విజయంపై కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రచారం నిర్వహించిన స్థానాల్లో బీజేపీ అఖండ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కళ్యాణ్, కొండమరాజు,రాజారెడ్డి, లాయర్ హరికృష్ణ, జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, సురేంద్రబాబు, రామాంజినేయులు, తెలుగుదేశంపార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ, మునిసిపల్ మాజీచైర్మన్ బెస్తచలపతి, బేకరినాయుడు, జనసేన నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, రాము, మారుతి పాల్గొన్నారు.

ధర్మవరం: 27 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు అన్నారు. పార్టీ గెలుపుపై స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో సంబరాలు జరుపుకుని స్వీట్లను పంచిపెట్టారు. నాయకులు జింకాచంద్ర, గొట్లూరు చంద్ర, సాకే ఓబుళేశు, గుండా పుల్లయ్య, శ్యామరావు, డోలా రాజారెడ్డి, జమీర్ అహమ్మద్, నబీరసూల్, భక్తవత్సలం పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ఢిల్లీ ఎన్నిల్లో బీజేపీ మెజార్టీ సాధించడం పట్ల శనివారం మండలకేంద్రలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వీరాంజి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి, మిఠాలు పంచిపెట్టారు. శరత్‌కుమార్‌రెడ్డి, అశ్వత్థప్ప, రంగారెడ్డి, సురేష్, నాగప్ప, క్రిష్టప్ప, సురేంద్రరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.


ధర్మవరంలో మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు


ఓబుళదేవరచెరువులో...

విగ్రహ ఏర్పాటులో వివాదం


గ్రామస్థులను విచారిస్తున్న తహసీల్దార్ నటరాజ, పోలీసులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటులో శనివారం వివాదం తలెత్తింది. విగ్రహ ఏర్పాటు చేస్తున్న స్థలం గతంలో అంగన్‌వాడీ సెంటర్‌ది అని గ్రామానికి చెందిన కొంతమంది అంగన్‌వాడీ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గొడవలు జరిగే అవకాశం ఉందని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ హేమంత్‌కుమార్, తహసీల్దార్ నటరాజ, డీటీ సురేష్‌కుమార్, సీఐ నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ప్రభాకర్ పోలీస్‌సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. నిర్మిస్తున్న స్థలంవద్దకు వెళ్లి విగ్రహం ఏర్పాటుచేస్తున్న సంఘం వారితో చర్చించారు. విగ్రహం ఏర్పాటుకు అడ్డుకునేందుకు కొంతమంది కుయుక్తులు పన్ని లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. నాలుగు నెలలక్రితం ఈ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం ఉండేదని, ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సెంటర్‌ను నిర్వహించలేదన్నారు. మరో ప్రాంతలో కేంద్రాన్ని నడుపుతున్నారని, ఈ స్థలానికి సంబంధించి మరోచోట స్థలాన్ని కూడా కేటాయించారన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అనవసరంగా రాద్ధాంతం చేసి గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు అధికారులకు తెలిపారు. 10వ తేదీలోగా విగ్రహ ఏర్పాటు పనులు ఆపేయాలని ఆర్డీఓ దృష్టికి తీసుకెళతామని, ఆర్డీఓ సమక్షంలో సమస్యను పరిష్కారిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

నిర్మించారు.. వదిలేశారు..!

- గోదాముల ప్రారంభం ఎప్పుడో...?


ఉప్పునేసినపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న గోదాము

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లి, గొట్లూరు గ్రామాల్లో రైతులు పండించిన పంటలను గోదాముల్లో నిల్వ ఉంచాలనే ఉద్దేశ్యంతో ఏడీసీసీ బ్యాంకు నిధులతో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను నిర్మించారు. ఉప్పునేసినపల్లి వద్ద నిర్మించిన గోదాము రూ.44లక్షలు, గొట్లూరులో 88లక్షలతో నిర్మించారు. 8నెలల క్రితం నిర్మించి వదిలేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రైతులు కందిపంటను పండించుకుని రోడ్ల సమీపాల్లో కల్లాలు వేసుకుని కందులను ఆరబోసుకుంటున్నారు. గోదాములలో పంటలను స్టాకు పెట్టుకుంటే రోజులను బట్టి బాడుగ చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అయినా వాటిని నిర్మించి ప్రారంభం చేయకపోవడంతో ప్రస్తుతం అవి నిరపయోగంగా మారాయి. అధికారులు స్పందించి గోదాములను తెరిచి రైతులకు ఉపయోగపడేలా అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు..!

- ధ్వంసమైన కల్వర్టు... వాహనదారుల ఆందోళన

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి క్రాస్ నుంచి రేగాటిపల్లికి వెళ్లే రహదారిలో ముచ్చురామి వద్ద రహదారి కింద భాగంలో ఉన్న కల్వర్టు పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు రోడ్డంతా కొట్టుకుపోయి కల్వర్టులోని రాళ్లు బయటికి కనిపిస్తున్నాయి. దీంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డు ఒకపక్క మాత్రమే ఉండటంతో భయంభయంగా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ప్రతిరోజు స్కూల్‌బస్సులు, వాహనదారులు ప్రయాణిస్తుంటారని ఆదమరిస్తే ప్రమాదాల బారిన పడాల్సిందే. పలువురు ద్విచక్రవాహనదారులు ఆ ప్రాంతంలో కిందపడి గాయపడ్డారని, ఎదురుగా వాహనం వచ్చినా పక్కకు కూడా వెళ్లే పరిస్థితి లేదు. అధికారులు, పాలకులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


రాళ్లుతేలి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

డ్రైనేజీలు అస్తవ్యస్తం

- ముందుకు పారని మురుగునీరు
- దుర్వాసనతో గ్రామస్థుల ఇబ్బందులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడంపల్లి గ్రామ ఎస్సీకాలనీలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. కాలనీలో ఇళ్ల మధ్య డ్రైనేజీల్లో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు ఉత్పత్తితో అల్లాడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. దోమలతో విషజ్వరాల బారినపడే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలభివృద్ధికి నిధులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. మండల అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించి మురుగునీరు నిల్వలేకండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


గరుడంపల్లిలో డ్రైనేజీ కాలువల్లో నిలిచిన మురుగునీరు

రోడ్లుపైనే మురుగునీరు

గాండ్లపెంట: మండలకేంద్రంలోని క్వార్టర్స్‌లో మురుగునీరు రోడ్లపై పారుతున్నాయి. అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. వెలుగు కార్యాలయం నుంచి మురుగునీరు కాలనీవాసులు బయటకు వదిలేస్తున్నారని, దీంతో రోడ్లపై నీరు పారి అపరిశుభ్రత, దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితంలేదన్నారు. అధికారులు స్పందించి మురుగునీరు పారకుండా చర్యలు చేపట్టాలని కోరారు.


గాండ్లపెంటలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ అధికారులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచించారు. ప్రజాసమస్యల పరిస్కారం కోసమే తెలుగుదేశంపార్టీ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించగా పలు సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వ్యక్తిగత కారణాలతో హాజరుకాకపోవడంతో ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. నియోజకవర్గంలోని రైతులు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను అందచేయాలని ఫిర్యాదుచేశారు. వృద్ధులు వితంతువులు, మహిళలు కొత్తగా పింఛన్లు ఇవ్వలేదని త్వరగా మంజూరు చేయించాలని కోరారు. గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, సీసీరోడ్లు, ఇంటిపట్టాలు మంజూరు చేయాలని ప్రజలు విన్నవించారు. 128 ఫిర్యాదులను మాజీమంత్రి స్వీకరించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిస్కారానికి కృషి చేస్తానని పల్లె వారికి హామీ ఇచ్చారు. 15 రోజులకొకసారి ప్రజాదర్బార్ నిర్వహిస్తానని అన్నారు. విజయ్‌కుమార్, మల్లిరెడ్డి, మైలేశంకర్, సామకోటి ఆదినారాయణ, రామారావు, శ్రీరాంనాయక్, చెన్నకేశవులు, కేశవ్‌నాయుడు, శ్రీరామ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, బొమ్మయ్య, పుల్లప్ప, నాగరాజు, సలాంఖాన్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ప్రజావ్యతిరేక ప్రతిపాదనలు తిరస్కరించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

కదిరి, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజల అభివృద్ధి కోసం కేటాయింపులు లేవన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచడానికి చర్యలు లేకపోగా, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి చర్యలు కనిపించలేదన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమంపైన పెట్టిన ఖర్చు గత యడాదికంటే తగ్గిందన్నారు. ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులు కేటాయించాల్సిన కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెరుగుదలతో దేశ ప్రజలు భారాలు మోస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ ప్రతిపాదలను ప్రజల్లో తీసుకెళ్లడానికి 14 నుంచి 20వ తేదీ వరకు వామపక్ష పార్టీలు ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జీఎల్ నరసింహులు, ముస్తాక్, బాబ్‌జాన్, జగన్, రామమోహన్, రఫీ, ఉదయ్, ఆంజి, అఖిల్ పాల్గొన్నారు.

చెస్‌తో మేధాశక్తిని పెంపొందించుకోవచ్చు

- చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, యువర్స్‌ఫౌండేషన్ ప్రతినిధులు

ధర్మవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): చెస్‌తో క్రీడతోమేధాశక్తిని పెంపొందించుకోవచ్చని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని కొత్తపేట శ్రీఉషోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం హైబ్రో చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ రాష్ట్రాస్థాయి ఓపెన్ చెస్ పోటీలను సత్యనారాయణ, కార్యదర్శి సుమన్ ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి 270 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. ముఖ్యంగా చెస్ అంటే మెదడును ఉపయోగించి ఆడేదన్నారు. ఏటా ఇదే పాఠశాలలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి క్రీడలోనూ గెలుపోటములు సహజమని వాటిని స్పోర్టీవ్‌గా తీసుకోవాలన్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమం ఉంటుందని, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందిస్తామని హైబ్రో చెస్ అకాడమీ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ తెలిపారు. యువర్స్‌ఫౌండేషన్ ప్రసిడెంట్ శీలానాగేంద్ర, సెక్రటరీ జయరాం, ట్రెజరర్ మోహన్, ఆర్గనైజింగ్ ప్రసిడెంట్ చాంద్‌బాషా, టోర్నీ హానరబుల్ ప్రసిడెంట్ డాక్టర్ బీవీ సుబ్బారావు, చెస్ అకాడమీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, వైకే శ్రీనివాసులు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

ధర్మవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీఓ మహేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులందరూ పాల్గొనాలన్నారు. ప్రజలు కూడా సమస్యలను ఈ కార్యక్రమంలో తెలియజేయాలన్నారు.

12వరకు గడువు పొడిగింపు

తనకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాలకోసం దరఖాస్తు చేసుకునేవారు 12వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏపీడీఓ రెడ్డెప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం మేదర, కుమ్మరి, కులాల వారు గ్రూపుగా ముగ్గురులేదా నలుగురు ఏర్పడి 12లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీఓ బీఎంఎంఎస్ యాప్‌లో దరఖాస్తులు అప్‌లోడ్‌చేయాలన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు చేయండి

గాండ్లపెంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సెల్ టవర్ ఏర్పాటు చేయాలని శనివారం కదిరి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నిర్వహించిన ప్రజాదర్బాలో వినతి పత్రం అందించారు. మండలంలోని గొడ్డివెలగల గ్రామస్థులు మాట్లాడుతూ సెల్‌టవర్‌లేకపోవడంతో ఫోన్లు పనిచేయడంలేదన్నారు. అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన చెందారు. వెంటనే గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటుచేయాలని కోరారు. కదిరి కుమ్మరవాండ్లపల్లి పెట్రోల్ బంక్‌నుంచి మసుకోని కుంట వరకు గుంతలమయమైన రోడ్డును మరమ్మతు చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పనిముట్ల పంపిణీ


విశ్వకర్మ యోజన కిట్లను పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పనిముట్లను శనివారం బీజేపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో వడ్డెర కులస్తులకు విశ్వకర్మయోజన పనిముట్లను అందించారు. ప్రధానమంత్రి మం జూరు చేసిన 33 పనిముట్లను అందించినట్లు మండలాధ్యక్షుడు వీరాంజి తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా వెంకటేశ్వరస్వామి కలశపూజ



పూజకోసం కలశాలు తీసుకొస్తున్న భక్తులు

పరిగి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఫైడేటి బస్టాండు సమీపంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కలశ పూజా కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా దేవతా ప్రతిమలకు పూజలు నిర్వహించి ప్రాణప్రతిష్ఠాహోమాలు చేసి అంగరంగ వైభవంగా కళ్యాణమహోత్సవం నిర్వహించారు. అనంతరం శనివారం పెద్దఎత్తున భక్తులు గోపుర కలశాలతో ఊరేగింపుగా తరలివచ్చి వాటికి పూజ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు వడ్డె హనుమయ్య, వెంకటేశ్, గంట శ్రీనివాసులు, పాళ్యంచంద్ర పాల్గొన్నారు.

దళితవాడలో సహపంక్తి భోజనం

పరిగి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 90ఇళ్ల కాలనీలో సహపంక్తి భోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం నిర్మించి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దళితులతో కలిసి భోజనం చేశామన్నారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ మూర్తి, వెంకటేశ్, చంద్రశేఖర్, శివ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన సదస్సు

గోరంట్ల, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండె వ్యాధులపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. మెడికల్ అధికారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు. సిహెచ్‌సిలో గుండె నొప్పికి ఉచితంగా ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. గుండెనొప్పి వచ్చిన గంటలోపే ఈ ఇంజనక్షన్ వేస్తే ఎటువంటి ప్రమాదముండదన్నారు. ఈవిష యంపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. ఉచిత ఇంజక్షన్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్, హెడ్ నర్సు పాల్గొన్నారు.

పగిలిపోయిన పైపులైన్‌కు మరమ్మతు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 8 : మండలంలోని గౌడనహళ్ళి పంచాయతీ జమ్మానిపల్లి, తురుకువాండపల్లిలో తాగునీటి సమస్యలు రాకుండా సర్పంచు పుట్టమ్మ పైపులైన్‌కు మరమ్మతు చేయించారు. గ్రామాలకు వచ్చే తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరు అంతా వృధా అవుతున్న విషయమై సర్పంచుకు విన్నవించిన వెంటనే మరమ్మతు చేయించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

లేపాక్షి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక నవోదయ పాఠశాలలో 2025-26సంవత్సరానికిగాను 9వ తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా సాగిందని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ప్రవేశ పరీక్షకు 1084మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 849మంది హాజరయ్యారన్నారు. నవోదయ, మహాత్మజ్యోతిబాపూలే రెండు పాఠశాలల్లోనూ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షలను హిందూపురంలో నాలుగు సెంటర్లలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 1228మంది హాజరుకావాల్సి ఉండగా 919మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు.

ఇంటి వంటతోనే ఆరోగ్యం



వంటల పోటీలకు హాజరైన విద్యార్థులు, వారి తల్లులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటిలో వండిన వంటలతో ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉంటారని మునిసిపల్ ఛైర్మన్ డి.ఇ. రమేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణ పరిధిలోని పాంచజన్య పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు వంటల పోటీలు నిర్వహించారు. మంట లేని వంట అనే కాన్సెప్ట్‌తో ఈ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తల్లితండ్రుల సహకారంతో ఇంటి వద్ద పదార్థాలను వండి పాఠశాలకు తీసుకొచ్చారు. బయట తిండి వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని పిల్లలకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు, కరెస్పాండెంట్ నందకుమార్‌లు పేర్కొన్నారు. లేపాక్షి తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, రోటరీక్లబ్ ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు మీనాక్షిలు, డాక్టర్ శ్రీవాణిలు జడ్జిలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ఆర్ మేఘనకు ప్రథమ బహుమతి, రిజ్వాన, లిఖితలకు రెండవ బహుమతి, నజ్మా నీమ, అలియాబానులకు మూడవ బహుమతులు అందాయి. విజేతలకు మునిసిపల్ ఛైర్మన్ బహుమతులు అందించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సోమందేపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారుతినగర్, శివనగర్, సాయినగర్, గాంధీనగర్‌లలో శనివారం 34విద్యుత్‌స్తంభాలు ఏర్పాటుచేసే కార్యక్రమాన్ని విద్యుత్‌శాఖ అధికారులు చేపట్టారు. టీడీపీ నాయకులు చంద్ర, సిద్దలింగప్ప మాట్లాడుతూ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలేక అంధకారం అలుముకోవడంతో స్థానికులు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారన్నారు. స్పందించిన మంత్రి ప్రజలకు ఇచ్చిన మాట మేరకు విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. శనివారం మారుతినగర్‌లో 14విద్యుత్‌స్తంబాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరీ, కిష్టప్ప, నరసింహులు, నాగప్ప పాల్గొన్నారు.

14న శిఖర కలశ ప్రతిష్ఠాపన

పెనుకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14న ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు డా.రంగనాథ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 13న గురువారం ఉదయం గంగపూజ, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధనం, నవ కుంభాభిషేకం, 14న ఉదయం కళావాహన, శిఖర కలశ ప్రతిష్ఠ ఉంటాయని, భక్తులందరూ హాజరై స్వామికృపకు పాత్రులుకావాలన్నారు.

రేషన్ బియ్యం.. తూకంలో మోసం

- ఎఫ్‌సీఐ నుంచి వచ్చేది టన్నుల్లో..
- స్టోర్లకు అందించేది ప్యాకెట్ల వంతున
- తూకంలో మాయమవుతున్న బియ్యం
- తక్కువ ఇస్తే ఎలా అని కార్డుదారుల ప్రశ్న



బియ్యం స్టాకు ఉంచుతున్న గోడౌన్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న చౌకధాన్య బియ్యం తూకాల్లో భారీగా మోసం జరుగుతోంది. ప్రభుత్వం అయితే ఒక్కో మనిషికి 5 కిలోల చొప్పున సక్రమంగా అందిస్తుంది. కానీ నిజానికి ఒక్కో మనిషికి సగటున ప్రతి నెల అందేది కేవలం 4 కేజీలు మాత్రమే. ఎందుకంటే తూకాల్లో తక్కువ ఇస్తున్నారు. ఇందుకు కారణం స్టోరు డీలర్లు కానే కాదు. గోడౌన్ నుంచి స్టోరు డీలర్లకు అందించే సమయంలోనే తూకం తక్కువగా వస్తున్నాయి. అంటే ఉదాహరణకు ఒక స్టోరుకు పది క్వింటాళ్ళు పంపాలంటే బియ్యం బస్తాలను గోడౌన్ వద్ద తూకం వేసి పది క్వింటాళ్ళు ఇవ్వాలి. కానీ పది కింటాళ్ళంటే 20 బస్తాలు పంపిస్తారు. లెక్క ప్రకారం ఒక్కో బస్తా 50 కేజీలు ఉండాలి. కానీ తూకం వేస్తే సంచితో పాటు 40 కేజీల నుంచి 45 కేజీలే ఉంటున్నాయి. అంటే 50 కేజీల బస్తాకు దాదాపుగా 5 కేజీలు తక్కువ వస్తున్నాయి. ఈ లెక్కన 20 బస్తాలకు దాదాపుగా వంద కేజీలు తక్కువ వస్తాయి. గోడౌన్ నుంచి బస్తాల లెక్కన పంపిస్తున్నారు. దీంతో డీలర్లకు బియ్యం భారీగా తూకం తక్కువగా వస్తున్నాయి.

ప్రతి నెల ఒక్క హిందూపురం నియోజకవర్గానికే ఫిబ్రవరి నెలకు 14,538 క్వింటాళ్ల. బియ్యం అలాట్ అయ్యాయి. బస్తాలు ఎఫ్‌సీఐ నుంచి వస్తాయి. 91,162 కార్డు దారులు ఉన్నారు. హిందూపురం అర్బన్‌లో అయితే 64 స్టోర్‌లు, రూరల్‌లో 32 స్టోర్‌లు ఉన్నాయి. తూకంలో తేడా కారణంగా మొత్తం మీద కార్డుదారులు నష్టపోతున్నారు. టన్నుల కొద్దీ బియ్యం మిగులుతాయి. స్టోర్‌లకు తక్కువ ఇచ్చి మిగుల్చుకున్న బియ్యం ఏమవుతున్నట్లు అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ బియ్యం పక్క రాష్ట్రాలకు తరలుతున్నాయా? అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తూకం తక్కువగా ఇస్తే చర్యలు తప్పవు: ఆరతి, సీఎస్‌డీటీ

ఎవరైనా తూకాల్లో మోసాలు చేసి కార్డు దారులకు తక్కువ బియ్యం ఇస్తే స్టోరు డీలర్‌పై చర్యలు తీసుకుంటాము. ప్రజలకు అందాల్సిన వాటా బియ్యం సక్రమంగా అందాల్సిందే. సంచులు పెట్టడం, రాళ్ళలో మాయ చేయడం చేస్తే చర్యలు తప్పవు.

డబ్బు పెట్టి కొనాల్సి వస్తోంది



ఆసియాబాను

అసలే రెక్కాడితే కానీ డొక్కాడని పేదలం. ప్రభుత్వం అందిస్తున్న బియ్యంతో నెలంతా గడపాలి. అయితే స్టోర్‌లలో తక్కువ తూకాలు వేయడంతో నెలాఖరులో డబ్బు పెట్టి కొనాల్సి వస్తోంది. గట్టిగా మాట్లాడలేకున్నాము.

ప్రతినెలా 2 కిలోలు తక్కువ ఇస్తే ఎలా?



యాస్మిన్, సీపీఐ కాలనీ

నెలకు నాకు అందాల్సింది 15 కిలోలు. అం దులో ప్రతి నెల 2 నుంచి 3 కిలోలు తక్కువ ఇస్తున్నారు. తూకాల్లో మోసాలు చేసి మా కడుపు కొడుతున్నారు. ఎందుకు తక్కువ ఇస్తున్నారని అడిగితే 'మాకే తక్కువ వస్తున్నాయి' అంటున్నారు.

ఢిల్లీ విజయం దేశాభివృద్ధికి ముందడుగు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ హర్షం
- పలుచోట్ల కూటమి నాయకుల సంబరాలు



జీఎం శేఖర్



పురంలో సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) :బీజేపీ ఢిల్లీలో 27 సంవత్సరాల తరువాత సాధించిన విజయంతో పార్టీ శ్రేణులు దేశవ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నారని బిజెపీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో కాషాయం జెండా రేపరేపలాడుతుంటే, ప్రతిపక్షాల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయన్నారు.బిజెపీ దేశ వ్యాప్తంగా అప్రతిహతంగా కొనసాగిస్తున్న విజయాలు దేశాబివృద్ధి వైపు అడుగులు వేయడానికి దోహదపడుతుందన్నారు.

కూటమి నాయకుల సంబరాలు

పెనుకొండ టౌన్: ఢిల్లీలో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడంతో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ, బీజేపీ నాయకులు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.



సోమందేపల్లిలో మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

హిందూపురం అర్బన్ : ఢిల్లీ ప్రజలు మోదీ డబులింజన్ సర్కార్‌పై నమ్మకంతో గెలుపు అందించారని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందూపురం అంబేద్కర్ సర్కిల్‌లో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మెన్ డి.ఇ. రమేష్‌కుమార్, బిజెపి నాయకులు రమేష్‌రెడ్డి, జనసేన నాయకుడు ఆకుల ఉమేష్ పాల్గొన్నారు.

సోమందేపల్లి : సోమందేపల్లి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో శనివారం ఢిల్లీలో బీజేపీ గెలుపుపై కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు.

మడకశిరటౌన్: ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శనివారం బీజేపీ తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధించడంతో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి స్వీట్లు పంచుతూ పెద్దఎత్తున సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తం, సుబ్బరాయుడు, భానుదాస్ పాల్గొన్నారు.

జీతాల కోసం యానిమేటర్ల పడిగాపులు

- గ్రామైక్య సంఘంలో స్వాహా చేశారని ఆవేదన



శివమ్మ



అరుణ

లేపాక్షి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామైక్య సంఘం వెలుగు కార్యాలయంలో యానిమేటర్లుగా పనిచేసిన కొంతమంది సిబ్బంది తమకు జీతాలు అందక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. శివమ్మ, అరుణలు ఏడు సంవత్సరాల నుంచి కంచిసముద్రం గ్రామైక్య సంఘంలో యానిమేటర్లుగా విధులు నిర్వహించారు. ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత యేడాది జూలైలో వీరిని విధుల నుంచి తొలగించారు. అయితే అప్పటికే దాదాపు పది నెలల జీతం రావాల్సి ఉంది. అప్పటి నుంచి వీరు వెలుగు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోగా సమస్యను గ్రామంలోనే పరిష్కరించు కోవాలని సమాధానం ఇచ్చారు. దీంతో సమస్యను వెలుగు పీడీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి వీరికి పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఆదేశించారు. నవంబరులో కేవలం రెండు నెలల జీతమే ఇచ్చి, మిగిలిన ఎనిమిది నెలల జీతం ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ విషయంపై వెలుగు ఏపీ రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఎవరికి ఎలాంటి జీత బకాయిలు లేవని ఆరోజే చెల్లించేశామని వివరణ ఇచ్చారు. గ్రామ సమైక్య సంఘంలో సైతం జీతాలు చెల్లించినట్లు తీర్మానం చేశారు. అయితే ఈ జీతాలు వీరికి ఇవ్వకుండా ఎవరు స్వాహాచేశారో తెలియడంలేదు. ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వారు విలపిస్తున్నారు. ఇప్పటికైనా తమ జీతాలు ఎవరు స్వాహాచేశారో విచారించి తమకు జీతాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 10వతేదీన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటుండటం వల్ల నియోజకవర్గం వ్యాప్తంగా అపరిష్కృత సమస్యలు ఏవి ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఓ చక్కటి వేదిక అని తెలిపారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ్, కౌన్సిలర్లు ఉమాశంకర్, ఉన్నారు.

రేపటి నుంచి విద్యార్థులకు నులిపురుగుల మందు పంపిణీ

అగళి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):అగళి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో అంగనవాడీ కేంద్రాలలో చదువుతున్న 1-19సంవత్సరాలలోపు చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు డా.శివానంద గాయత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఆరోగ్య వైద్యాధికారి ఆదేశాల మేరకు జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. కావున పాఠశాలలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రతి ఒక్కరూ చిన్నారులకు నులిపురుగుల మందులు అందేలా చూడాలని వారు సూచించారు..

నడిరోడ్డుపైనే మురుగునీరు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 8 :మండలంలోని మణూరు పంచాయితీ కేంద్రంలో నడిరోడ్డులోనే మురుగునీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఎగువ ప్రాంతంలో పైపులైన్ పగిలి నీరు లీక్ అయి ఆ నీరు రోడ్డులో ప్రవహిస్తోంది. సచివాలయం ప్రక్కన గ్రామం మధ్యలో ఉన్న దేవాలయం ముందు రొచ్చుగా తయారైంది. దీంతో గ్రామ ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి వల్ల దోమలు వ్యాప్తిచెంది ఈ ప్రాంతంలో చిన్నారులకు జ్వరాలు కూడా సోకుతున్నాయి. పలు మారులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడంలేదని సంబందిత అధికారులు తగు చర్యలు తీసుకొని మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్బీకేలో నీటి సౌకర్యంలేక ఉద్యోగుల పాట్లు



నీరులేక వృథాగా ఉన్న మరుగుదొడ్లు

సోమందేపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రంలోని ఆర్బీకేలో నీటి సౌకర్యం లేక మహిళా ఉద్యోగినులకు తిప్పలు తప్పడం లేదు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేదారిలో ఉన్న ఆర్బీకేలో ఈ దుస్థితి దాపురించింది. గత కొన్ని నెలలుగా సమస్య వేధిస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్బీకేలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి చెత్తాచెదారంతో అధ్వాన్నంగా మారాయి. దీంతో కనీస అవసరాలు తీర్చుకోవడానికి మహిళా ఉద్యోగులు చెట్లను పొదలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా టీడీపల్లి రంగనాథస్వామి జ్యోతుల ఉత్సవం

మడకశిర రూరల్ ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపల్లి గ్రామం సమీపంలో కొండపై వెలసిన రంగనాథస్వామి, శనేశ్వరస్వామి వారికి గ్రామస్థులుజ్యోతుల ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం నుంచి భక్తులు గంగ పూజ, అభిషేకాలు ,నవగ్రహ పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి కొండపై ఉన్న ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రారంభానికి ముస్తాబైన జామియా మసీదు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆరేపేటలో పురాతనమైన జామియా మసీదును తొలగించి దాని స్థానంలో కొత్తగా నిర్మించిన మసీదును ఆదివారం ప్రారంభించనున్నట్లు ముతవల్లీ, ముస్లీం పెద్దలు తెలిపారు. మడకశిర పట్టణంలో తొలిసారిగా నిర్మించిన మసీదును రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఇప్పటికే ప్రారంభానికి ముస్లిం పెద్దలు ఏర్పాట్లను పూర్తి చేశారు.

40 ఏళ్ల తర్వాత మాట్లాడుకున్నారు..



తమకు చదువు చెప్పిన గురువులతో పూర్వ విద్యార్థుల గ్రూప్‌ఫోటో

పెనుకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): 40ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి మనసువిప్పి మాట్లాడుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో 1984-86సంవత్సరంలో 6, 7 తరగతులు చదివిన పూర్వ విద్యార్థులంతా శనివారం పాఠశాలలో సమావేశమయ్యారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని వారి వారి అనుభవాలను పంచుకుని ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సరస్వతమ్మ, శ్యామలమ్మ, జయలక్ష్మమ్మ, మనోరంజమ్మలను సత్కరించారు.


గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం దొమ్మరహట్టి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి 5వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మైలారప్ప తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని తెలిపారు. మార్చి 6 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలోని 5వతరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుణ దరఖాస్తులకు గడువు పొడిగింపు

గుడిబండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఈనెల 7వతేదీ వరకూ ఉన్న గడువును 12వతేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన లబ్ధిదారులు ఈనెల 12వతేదీలోగాపంచాయతీ కార్యాలయం, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా ఆంజనేయస్వామికి పూజలు



గుడిబండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామ సమీపంలో వెలిసిన ఆంజనేయస్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఆకుపూజ, అభిషేకం, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

వసతి నిలయాన్ని తనిఖీ చేసిన బాలల హక్కుల కమిటీ

పావగడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం ముందున్న మెట్రిక్యులేషన్ వసతి నిలయాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు కేటి తిప్పేస్వామి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి నిలయంలో నెలకొన్న అసౌకర్యాలు, అపరిశుభ్రత, ఇతర సమస్యలపై వార్డెన్ రమేష్‌తో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం విద్యార్థులకు కల్పిస్తున్న భోజన సౌకర్యాలు, స్నాక్స్ ఇతర అంశాలపై స్వయంగా విద్యార్థులతోనే అడిగి తెలుసుకున్నారు. అయితే వసతి నిలయం పక్కలో ఉన్న అపరిశుభ్రతపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు.

బైక్ దొంగల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



చోరీ కేసులో నిందితులను చూపుతున్న పోలీసులు

రొళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో ఇంటి వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న నిందితులను శనివారం మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, రొళ్ల ఎస్ఐ వీరాంజనేయులు, సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ నిందితుల వివరాలు వెల్లడించారు. అగళికి చెందిన ప్రశాంత్‌కుమార్, కర్నాటక ప్రాంతానికి చెందిన కిత్తగళి వసంత వీరిద్దరూ ఓ ప్రైవేట్ మెడిసన్ కంపెనీలో పనిచేసేవారు. అతి విలాసానికి అలవాటుపడి రాత్రి వేళల్లో ఆరుబయట నిలబడిన ద్విచక్ర వాహనాలను దొంగలించడం ప్రారంభించారు. రొళ్ల మండలానికి చెందిన మూడు బైకులు, గుడిబండ మండలానికి చెందిన ఒకబైకును అపహరించారు. రొళ్ల ఎస్ఐ బ్యాడిగెర చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా వీరిని అరెస్టుచేసి అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని మడకశిర కోర్టుకు హాజరుపర్చారు. అనంతరం రూరల్ సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, మండల ప్రజలు రాత్రి వేళల్లో ఇంటి ముందు పడుకోరాదని, తమ ఇంటి నుండి వేరే ఊళ్లకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్త వహించాలని, ఫోన్‌లో వచ్చే క్యాష్‌డిపాజిట్ వంటి వాటికి స్పందించరాదని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ బాలాజీ, కానిస్టేబుల్ రమణ, ప్రసాద్, షఫీవుల్లా, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్ చోరీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

అగళి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అగళి మండలంలోని కదిరేపల్లి గ్రామానికి చెందిన రైతులు దొడ్డయ్య, నరసింహప్ప పొలాల్లో బోరుబావికి అమర్చిన రెండు స్టార్టర్లు, 50మీటర్ల కేబుల్‌వైరును గురువారం రాత్రి దుండగులు అపహరించుకెళ్లారు. ఈ విషయంపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పులు చేసి మరీ రూ.29వేలు విలువచేసే స్టార్టర్, కేబుల్ అమర్చామని అది కాస్త చోరీకి గురికావడంతో పంట కూడా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టార్టర్లు దొంగలించేవారిపై పోలీసులు గట్టి నిఘా ఉంచి దొంగతనాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాహనాలకు లైసెన్సులు తప్పనిసరి: ఎస్ఐ వీరేష్

అగళి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలకు, ఫోర్‌వీలర్లకు లైసెన్సులు తప్పనిసరి ఉండాలని అగళి ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు. మండలంలో పీబ్యాడిగెర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలన్నారు.